క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేస్తున్న ఎంఈఓ రాములు, తదితరులు

ఆమదాలవలస: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని ఎంఈఓ కె.ఎ.రాములు అన్నారు. జిల్లా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో తయారుచేసిన ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పైల రవికుమార్, ఎస్.అరుణ, బంగారు శరత్‌కుమారి ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గురుగుబిల్లి అప్పారావు ఎం.ఉమాకుమారి, జి.కుమారి, శ్రీనివాస్, గొంటి గిరిధర్, జన విజ్ఞాన వేదిక సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవరి సాగు లాభదాయకం


శ్రీవరి సాగును పరిశీలిస్తున్న సత్యనారాయణ

నరసన్నపేట: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో శ్రీవరిని సాగు చేయడం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని రావులవలసలో పల్లి శివ, పల్లి శంకరరావులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఏడు ఎకరాల విస్తీర్ణంలో బుధవారం శ్రీవరిని (నాట్లు) సాగు వేశారు. దీనిని పరిశీలించిన సత్యనారాయణ మాట్లాడుతూ.. వరి నాట్లు వేసే యంత్రంతో శ్రీవరిని సాగు చేస్తు ఖర్చు తగ్గుతుందని, దిగుబడి బాగుంటుందన్నారు. మొక్కలన్నీ వరుస క్రమంలో ఉండటంతో కలుపు నివారణకు, ఎరువులు వేయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు ఈ పద్ధతిలో వరి సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీపీఎం ధనుంజయ్, మాస్టర్ ట్రైనర్ తోట రమణ, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

కొత్తూరు: స్థానిక ఎంపీపీ పాఠశాల-1కు మండలంలోని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ రూ.50 వేల విలువ చేసిన ఎనిమిది డ్యూయల్ బెంచీలను బుధవారం హెచ్ఎం ప్రసాదరావుకు అందజేశారు. బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చుంటున్నారని, దాతలు ఎవరైనా సాయం చేయాలని హెచ్ఎం కోరారు. పాఠశాలకు బెంచీలను అందించి వైద్యాధికారి తన ఉదారతను చాటుకున్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉన్నప్పుడే పాఠాలు బోధపడతాయన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ జైళ్ల తనిఖీ


నరసన్నపేట: ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి హరిబాబు

నరసన్నపేట: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి కె.హరిబాబు అన్నారు. నరసన్నపేట, పాతపట్నం సబ్ జైళ్లను బుధవారం తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సదుపాయం అవసరమైతే దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలించి న్యాయవాదిని కల్పిస్తామన్నారు. జైళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఖైదీలకు మెనూ సక్రమంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న నవజీవన్ అనాథ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

సౌండ్ సిస్టమ్ వితరణ

జలుమూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని జలుమూరు ప్రాథమిక మోడల్ పాఠశాల హెచ్ఎం ఇప్పిలి మాధవరావు అన్నారు. బుధవారం జలుమూరు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి వైద్యభూషణ జగన్నాథరావు రూ.16,800 విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు అందించారు. జగన్నాథరావు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివానని అన్నారు. తనవంతు సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

నరకయాతన

- పల్లె పండగ రహదారులకు మోక్షమెప్పుడు?
- రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం
- ఆరేడు నెలలు కావస్తున్నా పూర్తికాని పనులు
- నడిచేందుకు కూడా అవస్థలు పడుతున్న ప్రజలు
- నరసన్నపేట నియోజకవర్గంలో పెండింగ్‌లో 66 పనులు


రాళ్లు తేలిన లకిమేర రోడ్డు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తాం.. సంక్రాంతి(గత) కల్లా అద్దంలా చేస్తామని నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. శంకుస్థాపనల పేరుతో హడావిడి చేశారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా.. చాలాచోట్ల రోడ్డు పనులు పూర్తికాలేదు. పనుల మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి. వృద్ధులు, గర్భిణుల అవస్థలు వర్ణణాతీతం. ఈ పల్లె రోడ్లుకు పండగ ఎప్పుడు వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మట్టితో ఉన్న రోడ్డే కొంతమేర బాగుండేవి. ఆరేడు నెలలుగా నరకం చూస్తున్నాం. ముున్ముందు తారు రోడ్ల మాట ఎలా ఉన్నా.. ప్రస్తుతానికి తమ అవస్థలు పగవాడికి కూడా రాకూడదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇంకెన్నాళ్లీ బాధలని మండిపడుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో పూర్తికాని రహదారుల వివరాలు		
మండలం	మంజూరైన రోడ్లు	పెండింగ్‌లో ఉన్నవి
నరసన్నపేట	49	19
జలుమూరు	24	8
సారవకోట	28	8
పోలాకి	51	31

నిధులు మంజూరైనా పూర్తికాని పనులు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. 152 పనులు ప్రారంభించగా.. 66 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నరసన్నపేట మండలంలో కరగాం నుంచి నారాయణవలస, నరసన్నపేట డింపింగ్ యార్డు నుంచి రావులవలసకు వెళ్లే మార్గం, ఎన్‌హెచ్-16 నుంచి లకిమేర మీదుగా సత్యవరం గ్రామానికి వెళ్లే రోడ్డు, చెన్నాపురం నుంచి మొయ్యిపేటకు వెళ్లే రోడ్డు, మబగాం రోడ్డు నుంచి కిళ్లాంకు వెళ్లే రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ పనులు తొందరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. జలుమూరు మండలంలోని గొటివాడ-పాగోడు, అల్లాడపేట-రామదాసుపేట, కరకవలస-ఎస్టీమాకివలస రోడ్డు, పింద్రువాడ రోడ్డు నుంచి జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు పనులు మధ్యలో నిలిపేశారు. సారవకోట మండలంలో వాండ్రాయి- రామకృష్ణాపురం రోడ్డు కూడలి, బంగోడుపేట-కుమ్మరిగుంటతో పాటు పలు రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పల్లెలకు పండగ ఎప్పుడు వస్తుందని ప్రశ్నిస్తున్నారు.


పూర్తికాని కరగాం - నర్సింగపలి రోడ్డు


అధ్వానంగా నరసన్నపేట డంపింగ్ యార్డ్ నుంచి రావులవలసకు వెళ్లే రోడ్డు

రోడ్డు పనులు పూర్తిచేయాలి



నరసన్నపేట నుంచి మా గ్రామానికి వచ్చేందుకు కాలువ గట్టుపై రోడ్డుకు కూటమి నాయకులు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. నెలలు పూర్తికావస్తున్నా పనులు పూర్తి కావడంలేదు. కంకర వేసి వదిలేశారు. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలి.

– ఎం.అమ్మినాయుడు, రావులవలస, నరసన్నపేట మండలం

ఆరు నెలలైనా పూర్తి చేయలేదు..



కరగాం నుంచి నర్సింగపల్లికి వచ్చే రోడ్డు పనులు చేపట్టి ఆరు నెలలకు పైగా అవుతుంది. ఈ రోడ్డు పనులు పూర్తికాకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నాం. గొప్పలకు పోయి రోడ్డు పనులు చేపట్టారు. ఇప్పుడు మధ్యలో నిలిపేసి ప్రజలకు అవస్థలకు గురిచేస్తున్నారు. మా రోడ్డుకు పండగ ఎప్పుడు వస్తుందో చెప్పండి.

– యాళ్ల జగన్నాథం, నర్సింగపల్లి, నరసన్నపేట మండలం

సంక్షేమ పథకాలు అందజేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

కొత్తూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అందజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు అన్నారు. కొత్తూరులో బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో సమావేశం నిర్వహించారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీలను సంక్షేమ పథకాలకు దూరం చేయడం తగదన్నారు. ఆరేళ్ల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. ఫోన్, ఇంటర్నెట్ పనిచేయక పోవడంతో ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలన్నారు. దేశం మొత్తం మీద పోషణ ట్రాకర్ యాప్ ఒక్కటే ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కువగా యాప్‌లు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పెరిగిన ధరల మేరకు మెనూ చార్జీలు పెంచాలన్నారు. వర్కర్లందరికీ 5జీ ఫోన్లు, ట్యాబ్‌లు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సిర్ల ప్రసాదరావు, ధనలక్ష్మి, అనురాధ, జలజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఏఎంఓకు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట మోడల్ స్కూల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ అధికారి కృష్ణవేణికి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. వావిలపల్లిపేట మోడల్ స్కూల్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు నిలిపివేశారని, తిరిగి వర్తింపజేయాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని విన్నవించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కె.సూర్యారావు, ఎం.కిరణ్, రామారావు, ఆదినారాయణ, రాజారావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

హిరమండలం: మండలంలోని భగీరథిపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ద్రవ జీవామృతం తయారీపై బుధవారం రైతులుకు అవగాహన కల్పించారు. జీవామృతం తయారీకి 10 కేజీల ఆవు పేడ, 10 లీటర్ల మూత్రం, 4 కేజీల బెల్లం, 4 కేజీల పప్పు దినుసుల పిండి, కేజీ పుట్ట మట్టి, తదితర పదార్థాలను వేర్వేరు పాత్రల్లో నీటిలో కలపాలన్నారు. అన్ని రకాల మిశ్రమాన్ని కుండీలో కలపాలన్నారు. ఐదు రోజులు నీడలో ఉంచి మురగనివ్వాలన్నారు. ఆ తరువాత దీనిని పది రోజుల్లోగా పంటలకు వాడుకోవాలని సూచించారు. దీనిని పంటలకు వేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండుతాయన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను పండించాలన్నారు. యూనిట్ ఇన్‌చార్జ్ లత, ఐసీఆర్పీ పాల్గొన్నారు.

చివరి సారిగా..


సంతాప సభలో పాల్గొన్న స్నేహితులు, గ్రామస్తులు

సారవకోట: మండలంలోని మాకివలస గ్రామానికి చెందిన నక్క సాయికుమార్ ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. మృతునిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన పలువురు స్నేహితులు, గ్రామస్తులు బుధవారం సంతాప సభ ఏర్పాటు చేసి పెద్దకర్మ నిర్వహించారు. ఇదివరకే సాయికుమార్ తండ్రి కూడా కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారు. తమ స్నేహానికి గుర్తుగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మాకివలస గ్రామస్తులు తెలిపారు.

పంటలను నమోదు చేసుకోవాలి

హిరమండలం: ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంటను రైతులు నమోదు చేసుకోవాలని కొత్తూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాల్ అన్నారు. బుధవారం ఎల్.ఎన్.పేట మండలంలోని సుమంతాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. హిరమండలం మండలంలోని పింద్రువాడ గ్రామంలో ఏఓ బి.సంధ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల నమోదును పరిశీలించారు. రైతులందరూ పంటను ఈ-క్రాప్ చేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాలకు వెళ్లి అన్ని రకాల పంటలను నమోదు చేయాలని ఆదేశించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పురుగు మందుల పిచికారీలో..
జాగ్రత్తలు తప్పనిసరి


పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)


బి.సంధ్య, ఏఓ

హిరమండలం:

పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య సూచించారు. పురుగు మందుల పిచికారీపై పూర్తిస్థాయి అవగాహన లేక చేసే చిన్న, చిన్న పొరపాట్ల వల్ల రైతులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. ప్రస్తుత ఖరీఫ్ సాగులో రై తులు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- క్రిమిసంహారక మందుల పిచికారీకి నేప్‌స్నేక్, తైవాన్ స్ప్రేయర్లు మాత్రమే వాడాలి.
- నేప్‌స్నేక్ స్ప్రేయర్లతో ఎకరానికి 12, తైవాన్ స్ప్రేయర్లతో 8 ట్యాంకులు మందును పిచికారీ చేయాలి.
- పురుగు మందులు ఉపయోగించే ముందు లేబుళ్లు, వివరాల పత్రాలు చదవాలి.
- నోటితో మందుల డబ్బాల మూతలు తీయకూడదు. పిచికారీ తరువాత ఖాళీ డబ్బాలను పూడ్చిపెట్టాలి.
- మందులను చేతితో కలపకూడదు. కర్రను ఉపయోగించాలి.
- పిచికారీ చేసేటప్పుడు మద్యం, పొగతాగడం, గుట్కాలు నమలడం చేయకూడదు
- ముక్కుకు మాస్క్, పలుచటి గుడ్డ కట్టుకోవాలి.
- గాలి వీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయకూడదు.
- ఎండతీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో పిచికారీ చేయకూడదు.
- చేతులు, కాళ్లకు గాయాలు, కురుపులు ఉన్నవారు, ఆరోగ్యం సరిగా లేనివారు పిచికారీ చేయకూడదు.

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మద్యం మాఫియా రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం పాతపట్నంలోని ఆమె కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అడ్డుగోలుగా పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. మద్యం టెండర్లతో రాష్ట్రంలో దోపిడీకి తెరతీసిందని ఆరోపించారు. బెల్ట్ షాపులను ప్రోత్సహించి మద్యం విక్రయాలను పెంచుకోవాలన్న ఆలోచనలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. మద్యం కేసులకు సంబంధించి కొంత మొత్తం కమీషన్‌ను కూడా నిర్ధారించడం దారుణమన్నారు. అందులో భాగంగానే పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇస్తున్నారన్నారు. కేవలం కమీషన్ల రూపంలో ఆదాయం వచ్చే మద్యానికి మాత్రమే అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. బెల్ట్ షాపులన్నీ కూటమి నేతల చేతుల్లో ఉన్నాయన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో మద్యం, ఇసుక కుంభకోణంలో స్థానిక ఎమ్మెల్యే పాత్ర ఉందని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఆయన అనుచరులు రెచ్చిపోతున్నారన్నారు. ఈ ఏడాది పాలనలోనే ఎమ్మెల్యే అవినీతిపై కథలు, కథలుగా చెప్పుకుంటున్నారన్నారు. గ్రామాల్లో కూటమి నేతల ఆగడాలు పెచ్చు మీరుతున్నాయని.. పాతపట్నం నియోజకవర్గం అంటేనే మాఫీయాకు అడ్డాగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సుపరిపాలన అందించామన్నారు. ప్రజలు అన్ని విషయాలనూ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్


మాట్లాడుతున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గూండాలు, పోలీసులు కలిసి ప్రజాస్వామ్యాన్ని తుంగలోకి తొక్కారని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ విమర్శించారు. ఆమదాలవలసలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. పోలీసుల సమక్షంలో రిగ్గింగ్ జరిగిందని, ఓటర్ల హక్కులను బహిరంగంగా కాలరాసిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు తోసేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామాల్లో ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు వెళ్లనివ్వలేదన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి గూండాలను బస్సులు, లారీల్లో తరలించి ఓట్లు వేసుకున్నారని విమర్శించారు. మీడియా ప్రతినిధులపై దాడులు చేసి, రికార్డింగ్‌ను అడ్డుకున్న ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు.

రీ పోలింగ్ నిర్వహించాలి..

పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి వీడియో రికార్డింగ్‌ను విడుదల చేయాలన్నారు. ఓటర్లను అడ్డుకున్న, దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి గూండాలను రప్పించిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఎన్నికలు జరపాలన్నారు. ఇది ఎన్నిక కాదని, ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేయాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు


మాట్లాడుతున్న కొప్పల ఈశ్వరరావు

ఆమదాలవలస: కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య పరిరక్షణపై తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని, ఈ ఎన్నికలను రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కొప్పల ఈశ్వరరావు అన్నారు. బుధవారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నికలో రాజ్యాంగం ద్వారా కల్పించిన స్వేచ్ఛ, న్యాయ సమ్మత ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ గూండాలు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. స్థానికేతరులను తీసుకువచ్చి రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. పోలీసుల ప్రవర్తన పూర్తిగా పక్షపాతంతో నిండిపోయిందన్నారు. అధికార టీడీపీకి అనుకూలంగా కొంతమంది పోలీసులు వ్యవహరించారన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల అధికారులు కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవరించడం అన్యాయమన్నారు. ఇటువంటి ఎన్నికల్లో గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలోని మేధావులు, రచయితలు, కళాకారులు, న్యాయవాదులు, పాత్రికేయులు, విద్యార్థులు, యువత, అన్నివర్గాలవారు దీన్ని ఖండించాలన్నారు. పార్టీ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు దానేటి రామ్మోహన్, పార్టీ నాయకుడు చింతాడ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

హిరమండలం: ఈ నెల 16, 17 తేదీల్లో మండలంలోని కూర్మ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు బుధవారం తెలిపారు. ఈ రెండు రోజుల్లో వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. హరే కృష్ణ, హరే రామ సంకీర్తనలు, శ్రీకృష్ణ భగవానుడికి హారతి, ప్రవచనాలు, నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పరామర్శ..


ఆమదాలవలస: అక్కివలసలో హేమంత్ తండ్రిని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని అక్కివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యాళ్ల హేమంత్ తండ్రి ఇటీవల గుండెకు సంబంధించిన వ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించారు. అదే గ్రామంలో బండి సిమ్మయ్య ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని సీతారాం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముత్తా విజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. కొల్లివలసకు చెందిన బాత విజయమ్మ, గుత్తావల్లికి చెందిన బొడ్డేపల్లి అమ్మాయమ్మ, నారాయణపురం గ్రామానికి చెందిన బుడుమూరు నర్సయ్య, గేదెల ఏకాశమ్మ, తుడ్డలికి చెందిన కెంబూరి మాధవరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మండల కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు, కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి నారాయణమూర్తి, నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, ఎస్.రామకృష్ణ, గురుగుబెల్లి కృష్ణ, సైరిగాపు శివ, కొండలరావు, తదితరులు ఉన్నారు.


బూర్జ: గుత్తావల్లిలో బొడ్డేపల్లి అమ్మాయమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్